కన్యాదాత వచ్చి తాంబూలమూ, అర్ధనూట పదహార్లూ, ఖద్దరు శాలువా నా చేతికిచ్చి ఆ కవిగార్ని సత్కరించమన్నారు.

అలాగే చేశాను.

తప్పట్లు మారుమ్రోగాయ్.

పుత్ర పౌత్రుల్తో భోగభాగ్యాలతో సుఖ సంతోషాలతో తులతూగమని ఆశీర్వదించి మరీ వెళ్ళేడాయన.

అంతకంతకీ నా స్టేటస్ పెరిగిపోతోంటే నాకు తెలీకుండానే నాలో ఒక రకమైన ఠీవి చోటు చేసుకోసాగింది. కుర్చీలో స్టైలుగా కూర్చుని గర్వంగా ఫీలవుతూ అందర్నీ కాస్త జాలిగా చూడసాగాను.

తాళిబొట్టుని చేత్తో పట్టుకుని, అక్షింతల్ని నాతో మొదలు పెట్టి అందరికీ పంచాడు పురోహితుడు.

జీలకర్రా బెల్లం పెట్టించడానికి వరుడ్ని టైమడిగాడో బ్రాహ్మడు.

రెండో బ్రాహ్మడితో ఏదో చెప్పి మొదటాయన లేచి నా దగ్గరి కొచ్చాడు.

"ముహూర్తాని కింకా వ్యవధి వుందాండీ" అడిగానతడ్ని

"వుందండీ. ఈలోగా చిన్నమాట తమకి మనవి చేద్దామనొచ్చాను. తర్వాత మిమ్మల్ని కలుసుకోవడం కుదరక పోవచ్చు"

"ఏ సంగతి?"

"మా అబ్బాయి ఇంటర్ పాసయ్యాడండి. టైపు హయ్యార్, షార్ట్ హేండ్ లోయరూ పాసయ్యాడు. హైదరాబాదులో మా తోడల్లుడి గారబ్బాయి ఏదో చిన్న వుద్యోగం చేస్తూ మా వాడ్నీ వచ్చెయ్యి వుద్యోగ ప్రయత్నాలు చేద్దామంటున్నాడు. సిఫారసుల్లేకపోతే చిన్న పనులు కూడా కాని రోజులు కదాని ఆలోచిస్తున్నానండి. తమరు కాస్త మాట సాయం చేస్తానంటే మా వాడ్ని పంపించేస్తానండి"

మాట సాయం! ఎంత తేలిగ్గా అంటున్నాడు!

"పంపించండి చూద్దాం"

"మీరా మాటన్నారు అదే పదివేలు" నమస్కరించి ఏవో మంత్రాలు చదువుతూ మంటపంలో కెళ్ళి జీలకర్రా బెల్లం పెట్టించాడు వధూవరులచేత.

తాళి కట్టడం కూడా అయ్యింది. లేచి అక్షింతలు వేసి చిన్నగా ఒళ్ళు విరుచుకుని హాలు బయటి వరండాలో కెళ్ళి త్రిబుల్ ఫైవ్ సిగరెట్ వెలిగించాను.

నాక్కొద్ది దూరంలో వరండాలో నిలబడి కబుర్లు చెప్పుకొంటున్న యువకుల మాటల్లో నా ప్రసక్తి దొర్లే సరికి వులిక్కిపడి చెవులప్పగించాను.

"ఆయనెవర్రా?"

"మన రాంబాబుకి బావ అవుతాళ్ళే. కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో పెద్ద ఆఫీసరు. రెండు చేతులా సంపాదిస్తున్నాళ్ళే"

నవ్వులు.

"మామూలు సంపాదన కాదురా బాబూ, దేశాన్ని నిలువునా తినేస్తున్నాడు. అయిదారెకరాల పొలం కొన్నాడు. రెండు మూడు లక్షల ఖరీదు చేసే ఇల్లు కట్టాడు. బ్యాంకుల్లో ఎంతో వుందిట. పిల్లలకి పెద్ద చదువులూ పెళ్ళానికి మెడనిండా నగలూనూ! గొప్పగా వెలుగుతున్నాళ్ళే గురుడు!"

"ఈ వెలుగెన్నాళ్ళులే, పాపం పండే వరకే. పండే వరకూ కాయ కూడా ఇలాగే మిడిసి పడుతుంది. పండేక దబుక్కున రాలి పడుతుంది. వీళ్ళూ అంతే. ఎప్పుడో ప్రభుత్వ దృష్టిలో పడతారు. అప్పుడు శ్రీమతే రామానుజాయ నమః!"

అంతా గట్టిగా నవ్వేశారు.

ఆ చల్లని వాతావరణంలోనూ ముచ్చెమటలు పోశాయి. వాళ్ల వంక చూళ్ళేకపోయాను. సిగరెట్ పారేసి తడబడుతూ హాల్లోకి నడిచాను.

"ఎటు వెళ్ళారు? ఇందాకట్నుంచి మీ కోసం వెదుకుతున్నాం. పదండి లాడ్జిలో పడుకుందురు గాని"

పినమావయ్య ముఖంలోకి సూటిగా చూశాను. ఆయన్లో కల్మషం లేదు. ఆ మాటలు మనస్ఫూర్తిగా అంటున్నాడు.

వీళ్ళందరికీ తను లంచగొండినని తెలుసు. చీడ పురుగూ దేశద్రోహి లాంటి మాటలు తెలీక పోయినా ఆ బాపతేనని తెలుసు. అయినా వీళ్ళు– మరుగుజ్జులుగా తను చూసిన ఈ పల్లెటూరి బైతులేం చేస్తున్నారు? తనలోని చెడుని పట్టించుకోకుండా తనలో వున్న గోరంత మంచినీ కొండంత చేస్తూ పొగుడ్తున్నారు. గౌరవిస్తున్నారు. వాళ్ళు చిన్నవాళ్ళు సామాన్యులూ గనుక అలా చేస్తున్నారనుకున్నాడు గాని వాళ్ళ గొప్ప మనస్సు గుర్తించ లేకపోయాడు తను.

నిజానికి వాళ్ళ ముందు, వారి నిస్వార్థ అభిమానాల ముందు నిలబడగల అర్హతుందా తనకి?!

"ఏవిటాలోచిస్తున్నారు?"

"ఏం లేదు ఏం లేదు..."

అప్రయత్నంగా వరండా వైపు చూశాను. నా వంకే చూస్తున్నారు ఇందాకటి యువకులు.

నా తల భూమిలోకి కృంగిపోతోంటే తల తిప్పుకున్నాను. ఆఖరికి మావయ్య వంక కూడా చూళ్ళేక పోతున్నాను. ఎందుకో నా తల వంగి పోతోంది. నా శరీరం

